ప్రజాశక్తి
శనివారం 20 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి





నిరసనలో పాల్గొన్న వైసిపి నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : వైసిపి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని వైసిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెనుకొండ మెడికల్ కాలేజీ వద్ద చేపట్టిన ఛలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా పూర్తిస్థాయి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. విద్య, వైద్యం పేదలకు అందకుండా చేసేలా రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశ్యంతో 17 మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్ తీసుకువచ్చారన్నారు. పేద వాడికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమలో మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, నాయకులు దీపికా, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మడకశిర, పుట్టపర్తి, అనంతపురం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాలకు చెందిన వైసిపి నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో మహిళా వైద్యులు అసౌకర్యం.. అభద్రత మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ విధులు నిర్వహించే కాజువాలిటీ వద్ద కనీసం వాష్‌రూమ్‌లు కూడా లేవు. వాష్‌రూమ్‌లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో విధుల్లో ఉన్న మహిళా డాక్టర్లు క్వార్టర్స్ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఆ ప్రాంతం మార్గమధ్యంలో నిర్మానుష్యంగా ఉండడంతో అక్కడ పోకిరీల వేధింపులు అధికమవుతున్నాయి. ఇటువంటి ఘటనే ఇటీవలి కాలంలో అనంతపురం సర్వజన ఆసుపత్రి వద్ద చోటు చేసుకుంది.



అసౌకర్యం..అభద్రత..!

◆ ప్రభుత్వాసుపత్రి మహిళా వైద్యుల కష్టాలు

◆ రాత్రి సమయాల్లో ఆకతాయిల వేధింపులు

◆ ఇటీవల ఓ వైద్యురాలిపై పోకిరి వెకిలిచేష్టలు

◆ ఆలస్యంగా నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఈనెల 15వ తేదీన విధుల్లో ఉన్న ఓ మహిళా జూనియర్ డాక్టర్ రాత్రి సమయంలో క్యాజువాలిటీ నుంచి క్వార్టర్స్ వైపు వెళ్తోంది. ఈ సమయంలో ఆ దారిలో కాపు కాచిన ఒక పోకిరి ఆమెపై లైంగిక వేధింపులకు గురిచేసినట్టు తెలుస్తోంది. దీనిపై ఆ డాక్టర్ ఫిర్యాదుతో టుటౌన్ పోలీసులు రంగంలోకి దిగి పోకిరిని అరెస్టు చేశారు. విధులు నిర్వహిస్తున్న చోటే సరైన వసతులుండాలుంటే ఇలాంటి సమస్యలను మహిళా వైద్యులు ఎదుర్కొనే పరిస్థితి ఉండదు. ఇక బ్లడ్ బ్యాంకు వద్ద బ్లడ్ క్రాస్ చెక్ చేసుకునే సమయంలోనూ డాక్టర్ వెళ్లే ప్రాంతంలో నిర్మానుష్యంగా ఉంటోంది. రాత్రి సమయాల్లో అక్కడ కూడా కొంత ఇబ్బందులను మహిళా డాక్టర్లు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. పనిచేసే చోటు సరైన వసతులు కల్పించాలని సిబ్బంది కోరుతున్నా దానిపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదు.



అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక, ఐద్వా నాయకులు

వైద్యులకు సరైన వసతులు కల్పించాలి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనిచేసే చోట వసతులు కల్పించాలని ప్రజారోగ్య వేదిక, ఐద్వా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యంను ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, రాష్ట్ర నాయకులు ఏజీ.రాజమోహన్, శ్రీనివాసరావు, నగర కార్యదర్శి అశ్వినిలు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాజువాలిటీ వద్ద వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా విధులు ముగించుకుని రాత్రి సమయాల్లో క్వార్టర్స్‌కు వెలుతున్న వారికి తగిన భద్రతా ఏర్పాట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్లడ్‌బ్యాంకు వద్ద నిర్మానుష్యంగానున్న చోట కూడా భద్రత కల్పించాలని కోరారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక వేధింపుల అంశంలో ఏమి చర్యలు తీసుకున్నారని నాయకులు సూపరింటెండ్‌ను అడుగగా ఈనెల 15వ తేదీన రాత్రి ఘటన జరిగితే 16వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేసామని చెప్పారు.

చికిత్స నిమిత్తం వెళ్లి.. రాత్రి కాపు కాచి..!

అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్‌కు చెందిన మోహన్ సాయి అనే యువకుడు బీకాం పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల ఇతను తనకు దగ్గు రావడంతో చికిత్స నిమిత్తం ఈనెల 13వ తేదీన సర్వజన ఆసుపత్రికి వెళ్లాడు. ఈ సమయంలో అక్కడ విధుల్లోనున్న ఓ జూనియర్ డాక్టర్ అతనికి చికిత్సలు అందించారు. ఆరోజు నుంచి సదరు యువకుడు తనను ప్రేమించాలంటూ వైద్యురాలిని వేధించడం మొదలు పెట్టాడు. ఇది తీవ్రం అయ్యి రాత్రి సమయంలో డాక్టర్ ఒంటరిగా వెళ్తున్న సమయంలో బెదిరింపులకు గురి చేశాడు. అతని నుంచి తప్పించుకుని వెళ్లిన వైద్యురాలు ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు మోహన్‌సాయిని శుక్రవారం నాడు అరెస్టు చేసినట్టు టుటౌన్ సిఐ శ్రీకాంత్ తెలిపారు. కోర్టు ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలియజేశారు.



శ్మశానవాటిక హద్దుల ఏర్పాటులో అధికారులు, నాయకులు, కాలనీవాసులు

పోరాట ఫలితమే శ్మశానవాటికకు స్థలం

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

పోరాటాలతోనే మామిళ్లకుంట క్రాస్ లో దళితుల శ్మశాన వాటికకు రెవిన్యూ అధికారులు స్థలం కేటాయించి సరిహద్దులను శుక్రవారం ఏర్పాటు చేశారని. సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఈ స్థలం కోసం సిపిఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరిగిన దళిత కాలనీవాసులకు విసుగు పుట్టి సిపిఎం నాయకులు ఆశ్రయించడంతో వారి పోరాటాల వల్ల మామిళ్లకుంట క్రాస్ దళిత కాలనీవాసుల సౌకర్యార్థం శ్మశానవాటికకు అధికారులు స్థలం కేటాయించాని తెలిపారు. ఈ స్థలం కేటాయించడం పట్ల ప్రజలు నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ వెంకటేష్, జిల్లావ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశు, పైపల్లె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతి నదికి జలకళ



కొడికొండ వద్ద చిత్రావతి నది ఉధృత ప్రవాహం



తనకల్లు వద్ద ఈదులవంక వాగు ఉధృత ప్రవాహం

ప్రజాశక్తి - చిలమత్తూరు

గురువారం రాత్రి కర్నాటకలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పరగోడు డ్యాం పూర్తిగా నిండిపోయి పొంగి పొర్లడంతో మండలంలోని కొడకొండ వద్ద ఉన్న చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. డ్యాం నుండి నీరు విడుదల కావడంతో మండలంలోని కొడికొండ వద్ద చిత్రావతి పరవళ్లు తొక్కుతోంది. ఉధృత ప్రవాహం కారణంగా సుబ్బారావుపేట, చాగలేరు, కొడికొండ గ్రామాలకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. నదీ పరివాహక ప్రాంతాల పంట పొలాలు కూడా నీట మునిగాయి. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పొంగి పొర్లుతున్న వాగులు

తనకల్లు : గురువారం రాత్రి ఎగువన కురిసిన వర్షాలకు మండల పరిధిలోని చీకటిమానీపల్లి వద్దగల ఈదుల వంక వాగు ఉధృతంగా ప్రవహిస్తూ జాతీయ రహదారిపై పొంగిపొర్లుతుంది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించిపోయాయి. వాగు ఉధృతికి ఒక కారు కొట్టుకొని పోయింది. అక్కడి స్థానిక యువకులు వాహనదారులకు హెచ్చరికలు చేస్తూ ద్విచక్ర వాహనాలను,కార్లను పంపిస్తున్నారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్ : చిత్రావతి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు బాగేపల్లి వద్ద గల పరుగోడు డ్యాము నిండి చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గువ్వలగుట్టపల్లి, సుబ్బరాయునిపల్లి, గ్రామాల ప్రజలు చిత్రావతి నది పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు. పెడపల్లి వద్ద గంగంపల్లికి వెళ్ళు రహదారి లో నీటి ఉధృతి తగ్గేంత వరకు నదిని దాటరాదని సూచించారు. అదేవిధంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లి, రాయలవారిపల్లి, యనమల పల్లి గ్రామాల ప్రజలు పిల్లలను వృద్ధులను చిత్రావతి నది పరివాహక ప్రాంతాలకు వెళ్ళనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రాయలవారిపల్లి చిత్రావతి బ్రిడ్జి సమీపంలో నీటి ఉధృతి తగ్గేంతవరకు నదిని దాటరాదని సూచించారు. అంతేకాక పుట్టపర్తి మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఈఎస్.వెంకటేష్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

డ్వాక్రా మహిళల డబ్బులు కాజేసిన వారిని ప్రశ్నించిన దానికి సిఐటియు నాయకులు ఈఎస్ వెంకటేష్‌పై దాడికి యత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కార్మిక కర్షక కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీ సభ్యుడు ఈఎస్ వెంకటేష్‌పై దాడియత్నాన్ని తీవ్రంగా ఖండించారు. బాధితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రశ్నించిన వెంకటేష్‌పై దాడికి యత్నం చేసి దుర్భాషలాడం తగదన్నారు. ఇలాంటివి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దాడియత్నానికి కారణమైన రవీంద్ర, సంబంధిత మహిళపై కేసు నమోదు చేసి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పిడి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, నాగరాజు, నరసింహ, అశ్వర్థరెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పై దాడికి యత్నించిన వారిపైకఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులను నమోదు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. దాడియత్నానికి నిరసనగా శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ వీఆర్ రాము మాట్లాడుతూ చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే బుక్ కీపర్ నాగరాజు, సిసి రవీంద్ర దౌర్జన్యంతో దాడికి యత్నించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిసి రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజుల పై హత్యాయత్నం కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం సిఐటియు కో కన్వీనర్ రామకృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షులు బాబు రెడ్డి, కొట్నూరు సంజీవరాయుడు, నాయకులు సూరి, గురు ప్రసాద్, కొట్నూర్ బాబా, హరీష్, ఆది, సంజీవ, గోపాల్, కుమార్, మూర్తి, వలి, జబీ, మునీర్, హనుమంతు, మణే సముద్రం హరి, గంగాధర, రామాంజి, గోపాల్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, మూర్తి, అంజి, నౌషాద్, గోవిందప్ప, కొట్నూరు శీను తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

డీఎస్సీలో న్యాయం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

మెగా డీఎస్సీలో తనకు వికలత్వ రిజర్వేషన్‌లో ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నా ఎంపిక జాబితాలో పేరు తొలగించడంపై శ్రీ సత్య సాయి జిల్లా ఓడీసీ మండలం, తుమ్మల కుంట్లపల్లి గ్రామానికి చెందిన జి.అంజన్నప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మెగా డీఎస్సీ 2025 వికలాంగుల కేటగిరిలో 40శాతం అర్హత కలిగి ఉన్నా తనకు ఉద్యోగం ఇవ్వకుండా తన తర్వాత ఉన్న వారికి ఇచ్చారన్నారు. దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు వసంత కుమార్ రాజేష్, దొనస్వామి, బొమ్మ శంకర , అంజనప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

ఈ పాస్ యంత్రాల ద్వారా సరుకులు పంపిణీ

జేసీ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈ పాస్ యంత్రాల ద్వారా డీలర్లు ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయవచ్చని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఈ పాస్ యంత్రాలను జాయింట్ కలెక్టర్ డీలర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈపాస్ యంత్రాల వినియోగం గురించి గత రెండు రోజులుగా మండలాల వారీగా డీలర్లకు శిక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ నుంచి జిల్లాకు 1367 కొత్త ఈపాస్ యంత్రాలు మంజూరు అయ్యాయని చెప్పారు. పాత యంత్రాలను స్వీకరించి వాటికి కొత్త ఈపాస్ యంత్రాలను అనుసంధానం చేశామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా చౌక దుకాణాల ద్వారా ఈ యంత్రాలతో సరుకులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన వివరించారు.

తల్లి మరణంతో అనాథలైన చిన్నారులు



చిన్నారులకు సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు గ్రామానికి చెందిన వడ్డీ అన్నపూర్ణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వడ్డీ అన్నపూర్ణ భర్త 10 సంవత్సరాల మృతిచెందాడు. దీంతెట అన్నపూర్ణ కూలి పనిచేసుకుంటూ, వితంతు ఫించన్ తో ఉన్న ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ జీవనాన్ని సాగిస్తూ ఉండేది. అయితే ఆమె అనారోగ్యంతో మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు 12 సంవత్సరాల గౌతం, 10 సంవత్సరాలు పండు అనాథలయ్యారు. ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు చీకటిలో మగ్గిపోకుండా ప్రభుత్వం, మానవతా వాదులు ముందుకు వచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి సమస్యను ఎమ్మెల్యే పిపి వీరయ్య దృష్టికి తీసుకెళ్లారు. వీరయ్య స్పందిస్తూ చిన్నారుల సంరక్షణకు ఎన్.టి.ఆర్ ట్రస్ట్ ద్వారా అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. సహాయం అందించాలని కోరుకునే వారు 7989278836 నంబరును సంప్రదించవచ్చని స్థానికులు చెప్పారు.

విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, విఆర్‌ఎలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ పెద్దన్న డిమాండ్ చేశారు. విఆర్‌ఎల దీక్షల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. విఆర్‌ఎల సమస్యల పరిష్కారం కోసం శనివారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో డివిజన్‌లోని విఆర్‌ఎలు పాల్గొనాలన్నారు. అదే విధంగా 22వ తేదీ కలెక్ట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు శివప్రసాద్, సాయి, పద్మావతి, గంగాధర్ ,బాబు, చిన్నయ్య, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలో పనిచేస్తున్న విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విఆర్‌ఎలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ హసీనాసుల్తానాకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం నాయకులు శ్రీనివాసులు, అశ్వర్థ, సుబ్రహ్మణ్యం, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : వీఆర్‌ఏలకు పే స్కేల్ విధానాన్ని అమలు చేసి నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని వీఆర్‌ఏల సంఘం నాయకులు పెద్దన్న డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులకు ప్రమోషన్స్, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు నరసింహులు, చలపతి, నాగరాజు, రాము, నాగభూషణ, సిపిఐ నాయకులు శిక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో తహశీల్దార్ కార్యాలయం ముందు రెండోరోజైన శుక్రవారం నిర్వహించిన దీక్ష కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, సీఐటీయూ, అవాజ్ నాయకులు పాల్గొన్నారు. వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండ్ల వెంకటేశ, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్‌ఏల సంఘం నాయకులు ఓబుళపతి, విజయ్ ప్రసాద్, బాలస్వామి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

గుడిబండ : తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్‌ఏ లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో రెండోరోజైన శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు లింగప్ప, వీఆర్‌ఏలు రవికుమార్, నరసింహమూర్తి, పెన్నఓబులప్ప, అనిత, మహేష్, భాగ్యమ్మ, మంజునాథ్, రంగదాసప్ప, నరసయ్య, సన్నపాతయ్య, తిప్పేస్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎలు కోరారు. ఈ మేరకు వారు ఆర్ఐ. చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరమేష్, వెంకటరమణప్ప, మహేష్, శశికళ, మంజుల, రామకృష్ణ, గంగాధరప్ప, తిప్పేస్వామి, రంగ స్వామి, నరసింహప్ప, భీమచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



ఈపాస్ యంత్రం అందజేస్తున్న అధికారులు

ఈ పాస్ యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని 35మంది డీలర్లకు ఈపాస్ మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. పెనుకొండలో జరిగిన ఈకార్యక్రమంలో ఈ పాస్‌మిషన్‌తో పాటు ఛార్జర్, సిమ్, యాంటీనా, యుఎస్ బి కేబుల్ కూడా ఇచ్చినట్లు అధికారులు తెలపారు. ఈ కార్యక్రమం లో ఈపాస్ టెక్నికల్ టీం చిన్నకృష్ణ, రామకృష్ణ, సిఎస్‌డిటి సావిత్రి, సివిల్ సప్లై డేటా ఎంట్రీ ఆపరేటర్ బి.అశోక్ రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం నాయకులు సిద్దన్న, డీలర్లు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని ఐటిఐ కాలేజీలో నల్లమాడ, అమడగూరు, ఓడిచెరువు మండలాల డీలర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఈపాస్ మిషన్లు అందజేశారు. డిఎస్ఒ, తహశీల్దార్ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డులు వస్తున్నాయని అందుకుగా ను ఈ పాస్ మిషన్లు పంపిణీ చేశామని వారు తెలిపారు.

కెనరా బ్యాంక్ బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - గుడిబండ

కెనరా బ్యాంక్ గుడిబండ బ్రాంచిని శుక్రవారం ప్రారంభించారు. ఆ బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ, అనంతపురం బ్రాంచ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గుడిబండ శాఖ సీనియర్ మేనేజర్ మల్లయ్య చేతులమీదుగా బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జనరల్ మేనేజర్ మాట్లాడుతూ కెనరా బ్యాంక్ పరిధిలో ఉన్న వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దుర్గేష్, నిరంజన్ కెనరా బ్యాంక్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ బుకింగ్ పరిశీలన

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని స్థానిక తహశీల్దార్ సౌజన్య లక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలం పరిధిలోని చోళసముద్ర రెవిన్యూ పొలం సర్వే నెంబర్ 178-5, 180-11లో సాగుచేసిన మొక్క జొన్న పంట నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది హరి, నిఖిల్, విఆర్ఒ సూర్య నారాయణ, ఆంజనేయులు రైతులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి తాడిమర్రి

ఎపిఐఐసి డైరక్టర్ చల్లా లక్ష్మిప్రసాద్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను అమరావతిలో శుక్రవారం కలిశారు. అసెంబ్లీలోని వారి ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని గౌని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రస్తుతం చదువుతున్న ఆరో తరగతికి చెందిన 60 మంది విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం పి.విజయమ్మ చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆదర్శ పూర్వ విద్యార్థి మల్లెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని పి కొత్తపల్లిలో వైద్యాధికారి అలేఖ్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కల్పన 52 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. 15మంది గర్భిణులకు, ఆరుగురు కిషోరిబాలికలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అంగన్వాడి సిబ్బంది పోషకాహార శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పై కార్యక్రమంలో సిడిపిఒ వెంకట లక్ష్మమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, సుధాకర్ రెడ్డమ్మ ఏఎన్ఎం గీత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రోప్పాల గ్రామంలో అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఒ లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో మహిళ చట్టాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షత హింసపై, నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాలకవర్గం సభ్యులు, మహాశక్తి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్:. చట్టాలపై విద్యార్థులు ప్రజలు అవగాహన పెంచుకోవాలని. కొత్తచెరువు అప్డేట్ సిఐ మారుతి శంకర్ తెలిపారు. కొత్తచెరువు జూనియర్ కళాశాల, మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్లత, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల కడుపుకొట్టొద్దు : ఎపి రైతుసంఘం



రైతులతో మాట్లాడుతున్న నాయకులు హరి, తదితరులు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

సోలార్ విద్యుత్తు ఉత్పత్తి పేరుతో రైతుల భూములు లాక్కొని వారి కడుపుకొట్టొద్దని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకశిర మండలంలోని వైబిహళ్లి, హరే సముద్రం, బుల్లసముద్రం, కల్లుమర్రి, మనూరు పంచాయతీల్లోని 28 గ్రామాలలో వేలాది ఎకరాల భూమిని రైతులకు మాయ మాటలు చెప్పి ఏజెంట్ల ద్వారా సేకరించే పనిలో ఉన్నారన్నారు. తరతరాలుగా వంశపారంపర్యంగా భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతుల నుంచి భూమిని సేకరించి కార్పొరేషన్ సంస్థలకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. ఈ చర్యలకు రైతులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పూర్తిస్థాయిలో సోలార్ కు భూసేకరణ జరిగితే ఈ ప్రాంత రైతులు వలస జీవనం సాధించడం తప్ప ఇతర మార్గం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల నుండి బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలన్నారు. రైతులకు ఎకరా భూమికి ఏడాదికి 50 వేల రూపాయల చొప్పున ప్రతిఏటా ఇవ్వాలని ప్రతి రెండు సంవత్సర ఒకసారి 20శాతం కౌలు పెంచాలని డిమాండ్ చేశారు. సోలార్ కంపెనీ నుండి రైతులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పర్యటించిన నాయకులు రైతులకు అవగాహన పత్రాలను పంపిణీ చేశారు అలాగే ఈనెల 24వ తేదీ న విజయవాడలో రైతుల కోసం జరుగు ధర్నా కార్యక్రమంలో రైతులు వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, యోగానంద, బి రవి, ముద్ర రంగప్ప, లక్ష్మీనరసప్ప స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : రైతుల కడుపుకొట్టే సోలార్ తమకొద్దనిఏపీ రైతు సంఘం నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్‌బాషా కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నంబులపూలకుంట రైతుల నుంచి బలవంతపు భూసేకర ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీల ఏర్పాటు పేరుతో వేలాది ఎకరాలు స్వాధీనం చేసుకుందన్నారు. రైతుల వద్ద సంవత్సరానికి 30వేల రూపాయలు లీజుకు తీసుకొని ఇంటిలో ఒక ఉద్యోగం ఉపాధి కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రైతుల సమస్యలపై ఈనెల 24న విజయవాడ లో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నంబుల పూలకుంట : సోలార్ పేరుతో భూములను స్వాధీనం చేసుకునే కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం అన్యాయమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలని తాటిమాను గుంతలులో రైతులతో మాట్లాడారు. తక్కువ ధరలకు రైతుల దగ్గర భూములను సేకరించి కార్పొరేట్ సంస్థల పరం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే భూములు కోల్పోయిన రైతులు కరువు కాటకాలతో పోరాడుతూ బెంగళూరు హైదరాబాద్ లాంటి నగరాలకు సగం మంది వలస పోయారని వాపోయారు. గ్రామాలలో వృద్ధులు, పిల్లలు తప్ప కన్పించడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఈనెల 24వ తేదీన విజయవాడలో జరుగు సమావేశానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కరపత్రాలు పంచారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల మీట్

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలో ఎంపిపి బగ్గిరి త్రివేణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. సమావేశానికి ఎంపిటిసిలు నలుగురు, సర్పంచులు నలుగురు మాత్రమే హాజరయ్యారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన వివిధ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు తమను ఎవరు ఏమి చేయలేరనే ధీమాతో సమావేశానికే డుమ్మా కొట్టడం విశేషం. మొక్కుబడిగా సాగుతున్న ఇలాంటి సమావేశాలు ఎవరికి ఉపయోగం అన్న ప్రశ్నలు మండల ప్రజల్లో వెల్లడవుతున్నాయి. సమావేశం ప్రారంభం కాగానే అజెండా ప్రకారం అధికారులను పిలిచి ఆయా శాఖల ప్రగతిని వివరించాలని ఎంపీడీవో నరసింహానాయుడు, పరిపాలన అధికారి గంధమనేని శ్రీనివాసులు శాఖల వారీగా పేరు పెట్టి పిలిచారు. అయితే సగానికి పైగా అధికారులు ఎవరూ సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. ప్రధానంగా తహశీల్దార్, ప్రభుత్వ వైద్యాధికారి కూడా సమావేశానికి హాజరు కాలేదు. అధికారాలు లేని పదవులతో సమావేశానికి వెళ్లిన వెళ్లకపోయినా ఒకటే అనే భావనతో ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదని తెలుస్తోంది. వేలాది రూపాయలు ప్రభుత్వం నుండి వేతనాలు పొందుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంపై పలు విమర్శలు వినపడుతున్నాయి. వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథ్ రెడ్డి, ఏపిఎం హరి ప్రసాద్, ట్రాన్స్‌కో ఎఇ శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జ్యోతి, హౌసింగ్ ఎఇ విశ్వనాథ్,తమ శాఖల ప్రగతి,అమలు చేస్తున్న పథకాలను సంక్షిప్తంగా రెండు ముక్కలలో వివరించారు.సమావేశం మొత్తానికి ఒకే ఒక్క సర్పంచి దంపట్ల సర్పంచి చల్లా కరుణాకరనాయుడు తమ పంచాయతీలో పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రజాప్రతినిధులు లేకపోవడం,సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంతో సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఈ సమావేశంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణితో పాటు జడ్పిటిసి కోటి సుధా, వైస్ ఎంపీపీలు గజ్జల వెంగళరెడ్డి, పార్వతమ్మ, ఎంపీడీవో నరసింహానాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉప ఎంపీడీవో కృష్ణప్ప, సర్పంచులు చల్లా కరుణాకరనాయుడు, ప్రభాకరరెడ్డి, మాదిరెడ్డి పద్మావతమ్మ, చిన్న ముసలప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్వచ్ఛ భారత్ కార్మికులకు, పంచాయతీ కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని సిఐటియు నాయకులు వివి రమణ , మండల కన్వీనర్ కుళ్లాయప్ప, స్వచ్ఛభారత్ కార్మికులు, పంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో శివ ప్రసాద్ రెడ్డి కు అందజేశారు. మండలంలోని సున్నంపల్లి, అల్లా పల్లి పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పంచాయతీ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 12 నెలల వేతానలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో నాయకులు అంజినప్ప, రమణప్ప, రమేష్, రాము, నిర్మల, శ్రావణి, నాగమ్మ, సాలెమ్మ, భాగ్యమ్మ, ఓబులమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో ఈ స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలు అక్టోబర్ 2 వరకు జరుగుతాయని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ, చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని ఉంచకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, టీడీపీ నాయకులు మురళీ, మోదా శివ, చైతన్య, పాఠశాల హెచ్‌ఎం రమణ, మూర్తి, హెల్త్ అసిస్టెంట్ కేశవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో గల శాంతి భద్రతల సమస్యలపై వారు చర్చించారు. అలాగే మహిళలపై జరిగే నేరాల విషయంలో ముందస్తుగా తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. గ్రామాలలో మహిళలను వేధించే ఆకతాయిల పైన ప్రత్యేక నిఘా ఉంచి వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని తెలిపారు.

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి పరిశ్రమలు స్థాపించి అక్కడ యువతకు ఉపాధి కల్పించి వలసలను ఆపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని ఈ ప్రాంతంలో తగినన్ని భూములు ఉన్నాయని చెప్పారు. అనంతపురం ,సత్యసాయి ఉమ్మడి జిల్లా కర్నాటక రాజధాని బెంగళూరుకు ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఉందన్నారు. ఈ ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని చెప్పారు. అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గం లోని కప్పల బండ పంచాయతీలో ఏపీఐఐసీ ద్వారా 2017లో ఎకరా రూ.11.74 లక్షలతో 104. 64 ఎకరాలను అప్పటి టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో అప్పటి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పరిశ్రమలు ఏర్పాటుకు భూముల సేకరించారన్నారు. పుట్టపర్తి మండలం కప్పల బండ పంచాయతీలో సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశారన్నారు. ఇందులో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు ఎంతమందికి అనుమతులిచ్చారు. ఇంకా ఎంత మిగులు భూమి ఉందో ప్రభుత్వం ద్వారా సంబంధిత పరిశ్రమల శాఖ మంత్రి వెల్లడించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. అదేవిధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు ప్రత్యేకంగా మహిళలకు ప్రభుత్వం ద్వారా పరిశ్రమలకు రాయితీలు ,విద్యుత్ రాయితీ వంటి సౌకర్యం కల్పించే అవకాశాలు ఉన్నాయా అని అడిగారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-పెనుకొండ

వైద్య విద్యార్థి సంతోష్ నాయక్ కు ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, మంత్రి సవిత ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. పెనుకొండ మండలం ఆడదాకులపల్లికి చెందిన రవీంద్రనాయక్, లతాబాయికి ఇద్దరు కుమారులు. రవీంద్రనాయక్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడు డేనియల్ నాయక్ ఇప్పటికే వైద్య విద్యను దాతల సహాయంతో అభ్యసిస్తున్నాడు. రెండో కుమారుడు సంతోష్ నాయక్ ఎంబిబిఎస్ సీటు సాధించాడు. కళాశాల ఫీజు చెల్లించినా వసతి ఖర్చులు చెల్లించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారన్న విషయం తెలుసుకున్న మంత్రి సవితమ్మ ట్రస్ట్ ద్వారా వారికి రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థి తల్లిదండ్రులకు ట్రస్ట్ డైరెక్టర్లు, నాయకులు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య , సీనియర్ టిడిపి నాయకులు నారాయణ స్వామి, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, కుపేంద్ర నాయక్, ట్రస్ట్ వైస్ చైర్మన్ నాగార్జున, డైరెక్టర్లు నీరుగంటి చంద్రశేఖర్, రామాంజనేయులు, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యవిద్యార్థికి సాయం అందజేస్తున్న నాయకులు

కల్తీ లేని ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

కల్తీ లేని ఆహారం వాడితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునిపాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో సూక్ష్మ ఫ్రూట్స్ సంస్థ అధినేత వెంకటేష్ ఆధ్వర్యంలో సర్వ వారు తయారు చేసిన మసాలా పౌడర్లను పాఠశాల లోని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూకల్తీ మసాలా పౌడర్లను వాడితే ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి అన్నారు. సర్వా సంస్థ వారు సాంప్రదాయ పద్ధతిలో రసాలు తయారుచేసి తక్కువ ధరకు అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సంస్థలను అందరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, హెచ్‌ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.



సంస్థ అందించిన మసాల పౌడర్‌ను చూపిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎదురుగా వస్తున్న ఎలక్ట్రానిక్ స్కూటీని టిప్పర్ వాహనం ఢీకొనడంతో స్కూటీ టిపర్‌లో ఇరుక్కుపోయింది. దీంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు డేవిడ్ (55) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - కొత్తచెరువు

పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయ్యగారి రజిత అన్నారు. కొత్తచెరువు మండలం మరకుంటపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోషణ్ మాహ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు శిశువులు తీసుకోవాల్సిన పోస్టికాహారం గురించి వివరించారు. అనంతరం అమ్మ పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాద్రి, ఉమాదేవి, అంగన్వాడీ వర్కర్లు శ్రావణి, సరోజ, ఆశా కార్యకర్త చంద్రకళ పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని, పుట్టపర్తి ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండల పరిధిలోని కంబాలపర్తి అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రం లో విద్యార్థులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహార విలువలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు, అంగన్వాడి కార్యకర్తలు విజయ, అరుణ ,భాగ్యలక్ష్మి, జయలక్ష్మి ,ఆశా కార్యకర్త లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కోగిర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హరికిరణ్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా హిందీ దివస్ నిర్వహించారు. ఈ సభకు జిల్లా వ్యాపంగా 30 మందిసీనియర్ హిందీ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవి, రచయిత, సామాజిక సేవ కార్యకర్త, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత జాబిలి చాంద్‌బాషాను హిందీ ఉపాధ్యాయులు సన్మానించారు. జాబిలి ఒక కవిగా, ఒక ఉపాధ్యాయుడిగా, సమాజ సేవా కార్యకర్తగా విద్యార్థులు భావిభారత ఉత్తమ పౌరులుగా తయారవడానికి హిందీ భాషతో పాటు, వ్యక్తిత్వం వికాస నైపుణ్యాలు నేర్పుతూ విద్యార్థులను ఒకవైపు విద్యాభివృద్ధికి, మరోవైపు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు యాస్మీన్, తౌహీర, ప్రసన్న, గ్రేవీ, షాహిన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. హిందీ భాషలోనే ఉపన్యాసాలు ఇస్తూ, హిందీ బాలగేయాలతో సభను ఉల్లాభరితంగా మార్చారు. హిందీ బాషా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా స్వచ్ఛత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో కేశవరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, గుడిబండ పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్, గ్రామపంచాయతీ సచివాలయ ,ఎం ఆర్ సి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నరేష్‌కృష్ణ

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నరేష్‌కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపీడీవో నరేంద్ర కుమార్ ఏపీడీగా ఉద్యోగోన్నతిపై నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పెనుకొండ రెగ్యులర్ ఎంపిడిఐగా ఉన్న నరేష్‌కృష్ణకు అధికారులు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి డీఎస్పీ శివ నారాయణస్వామి శుక్రవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ వలీభాషాకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ కానిస్టేబుల్ అమల, హోంగార్డు రాజు మౌలా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాదును ఆయన కార్యాలయంలో పుట్టపర్తి నియోజకవర్గం జనసేన నాయకులు శుక్రవారం కలిశారు. పార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ తదితరులు కలెక్టర్‌నుకలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఈశ్వర్, జయరాం, కరుణాకర్, రాము, హనుమంతు నాయక్, కేసాపురం అధ్యక్షులు బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్వహించే చలో మెడికల్ కాలేజ్ నిరసనలో పాల్గొనేందుకు వచ్చిన వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను హిందూపురం వైసిపి నాయకులు సన్మానించారు. గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో జక్కంపూడి రాజాను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మనోజ్ జూలియట్, నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు కదిరిష్, రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి కొల్లకుంట వరుణ్ రెడ్డి, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు లోకేష్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.



రాజాకు జ్ఞాపికను అందిస్తున్న వేణురెడ్డి తదితరులు

చెత్త సేకరణపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

చెత్త సేకరణ పై ప్రజలతోపాటు పంచాయతీ కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరిశీలన కమిటీ సభ్యులు కావ్య, ఆశాలత సూచించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పంచాయతీలో వారు శుక్రవారం పర్యటించారు. తడి, పొడి చెత్త సేకరణ పరిశీలించడంతోపాటు వర్మీ కంపోస్ట్ ఏర్పాటు చేయడం, ట్రై సైకిల్, ట్రాక్టర్ ద్వారా ఇంటి నుండి ప్రతి రోజు వంద శాతం చెత్త సేకరణ తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివకుమార్, సర్పంచి రత్నమ్మ, చిన్నవీరప్ప, స్వచ్ఛభారత్ ఎంసిఒ దాదాపీర్, ఎంపీటీసీ షేక్ షమీమ్ ఉన్నీసా, పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని సత్య సాయి జిల్లా కురుబ సంఘం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర కురుబకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడిగా చెప్పుకునే జబ్బుల శ్రీనివాస్ రాష్ట్ర మంత్రిపై లేని పోనీ ఆరోపణలు చేస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం, తన సొంత నిధులు ఖర్చు పెట్టుకుంటూ పోరాడుతున్న మంత్రిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సురేంద్ర, మంజునాథ్, నాగరాజు, శేఖర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.